


# గాంధీ పాఠం

**యం.సి. శివశంకర శాస్త్రి**

**అనగనగా ఓ ఊరు. ఈ సువిశాల ఆంధ్రరాష్ట్రంలో అదో మారుమూల పల్లెటూరు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు పదిహేనేళ్లు దాటిన మీదట ఆ ఊరి జనమంతా కలిసి గట్టి ప్రయత్నం చేయటంతో అక్కడ ఉన్న వీధి బడి స్థానే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చోటు చేసుకుంది.**

పరీక్షలైపోయాయి. సంక్రాంతి శెలవుల తర్వాత స్కూల్ మళ్లీ తెరిచి నెల రోజులు దాటి పోయింది.

ఆవేళ మధ్యాహ్నం బడికి అరగంటపైబడి ఆలస్యంగా వచ్చిన గాంధీరావు మాస్టారు తిన్నగా నాల్గవ తరగతి గదిలో కెళ్లాడు. ఆయన్ని చూడగానే ఒకరిద్దరు తప్ప తక్కిన పిల్లలంతా బుద్ధిగా బుద్ధ విగ్రహాలై గమ్మున కూచున్నారు. కుర్చీ ముందుకు లాక్కుని కూచుంటూ అల్లరి చేస్తూన్న ఆ మూకకేసి గుర్రున గుడ్లురిమి చూసేసరికి అందరి నోళ్లకు తాళాలు పడ్డట్టయి చీమ చిటుక్కుమంటే వినిపించేంత నిశ్శబ్దం నిలచిందక్కడ.

"సార్! ఈ కిట్టిగాడు నా సంచిలోంచి పెన్సిలు ముక్క కొట్టేసిందికాక పైపెచ్చు ఇంకా నన్నే తిడుతూన్నాడండీ!" కంప్లైంట్ చేసి వాడికేసి గుర్రున చూస్తూ జారిపోతున్న నిక్కర్ని పైకి లాక్కుని కూచున్నాడో కుర్రకుంక.

"ఛీ! ఛీ!! ఏం పిల్లర్లావిూరు. కిష్కింధలో పుట్టాల్సినోళ్లంతా అడ్రసు తప్పి ఈ మాముడూరులో పుట్టినట్టున్నారు. అస్తమానం వాడి మీద వీడు, వీడు మీద వాడు చాడీలు చెప్పుకోవడం తప్ప వేరే పనే లేనట్టుంది మీకు. ఇదిగో గమ్మున కూచున్నారో సరి, లేదంటే తోలు తీసి డోలుకట్టి వాయించేస్తాను" బెత్తం చూపెడుతూ బెదిరించి పాఠ్య పుస్తకం తెరిచి చేసి చెప్పాల్సిన పాఠాన్ని ఓ సారలా మొదటి నుంచి చివరి దాకా గబగబా చూసుకుని పాఠం చెప్పేందుకు ఉద్యుక్తు డయ్యాడు.

ఈలోగా హరినారాయణ అనే కుర్రాడి తండ్రి వచ్చి "అయ్యా! పంతులు గారూ!! మా హరిగాడు పొద్దుగూకులూ అల్లరి పిల్లగాళ్లతో గోళికాయ లాడుకుంటూ ఇంటికాడ బుక్కుపట్టి సదూకోటమే మానేశాడండీ. పైగా ఈ మద్దెన ఇపరీతంగా అబద్దాలు సెప్పటం కూడా నేర్సుకుంటుండు. ఈడికి బుద్ధి చెప్పి మంచి దారి సూపెట్టండయ్యా' ' కొడుకు గురించి గాంధీరావు మాష్టారుతో వినయంగా చెప్పుకున్నాడు.

"నువ్వేం బాధపడకయ్యా! మీ వాణ్ణి మంచి మార్గాన పెట్టి శభాష్ అనిపించుకునేలా చేసే బాధ్యత నాది" అతనికి భరోసా ఇచ్చి పంపివేశాడు.

"ఈ రంగడు చక్కిలిగింతలు పెడుతూపైగా అందర్నీ వెక్కిరిస్తున్నాడు సార్!" బుడుంగున ఫిర్యాదు చేశాడు ఓ కుర్రకుంక.

"పాఠం జరక్కుండా ఇట్టే అల్లరి చేస్తూ కూచున్నారంటే చిర్రెత్తుకొచ్చి ఈ చింత బెత్తం మీ వీపుల మీద చిందులేసి మీ తిక్క కుదిరిం చేస్తుంది" టేబుల్ మీది బెత్తాన్ని చేత పట్టుకు చూపెడుతూ గట్టిగా హెచ్చరించేసి పాఠం మొదలెట్టాడు.

'ఇప్పుడు మీరు చెప్పేది గాంధీ పాఠమాండీ?'

"ఆఁ! ఆ పాఠమే చెబుతూన్నాను. శ్రద్ధగా వినండి... గాంధీజీ పూర్తిపేరు మోహన్‌దాస్ కరమ్‌చంద్‌గాంధీ. మనదేశ స్వాతంత్ర్యోద్యమంలో ముమ్మరంగా పాల్గొని నెత్తురు చుక్క నేల పడకుండా మనకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టిన మహనీయుడాయన. భారత జాతి కంతటికి తండ్రివంటివాడని జాతిపితగా ఆయనను గౌరవించారు. ఆయన జీవితంలో జరిగిన ఓ చిన్న సంఘటనే నేను చెప్పబోయే గాంధీపాఠం". పాఠం గురించి ఓ చిన్న ఉపోద్ఘాతం చెప్పి చిటెకెడు నశ్యం ఛర్రున పీల్చేశాడు గాంధీ రావు మాస్టారు.

ఈలోగా కరీం అనే కుర్రాడు ఏదో చిలిపి పని చేసేసరికి వాడికేసి గుర్రుమని చూశాడు మాస్టారు. మిగతా కుర్రాళ్లంతా వాణ్ణే మందలించి

"టైమయిపోతుంది ఇక పాఠం చెప్పండి సార్!" అన్నారు ఏక కంఠంగా.

"మీలాగే గాంధీజీ ప్రైమరీ స్కూల్‌లో చదవే రోజుల్లో ఆ పాఠశాలను తనిఖీ చేసేందుకు ఓ విద్యాధికారి వచ్చి కొన్ని ఇంగ్లీషు పదాలను పిల్లలకు డిక్టేషన్ చెప్పమన్నాడు. ఉపాధ్యాయుడు డిక్టేషన్ చెబుతూ మధ్యలో 'కెటిల్' అనే ఓ పదం కూడా చెప్పాడు."

"సార్! కేట్లీ అంటే ఏంటిది?" అర్థం తెలుసుకోగోరి ఓ విద్యార్థి అడిగిన ప్రశ్న. "కేట్లీ కాదురా నాయనా! కెటిల్ అనాలి. కెటిల్ అంటే నీరు కాచే పాత్ర. ఇంకా వివరంగా చెప్పాలంటే మనం టీ వగైరాలు చేసుకునేప్పుడు నీరు కాచేందుకుపయోగించే పొడుగాటి కొమ్ము ఉండే పాత్ర" అని అర్థం వివరించి చెప్పాడు మాస్టారు.

"ఆ తర్వాత ఏమయింది సార్?" జరిగిందేమిటో తెలుసుకోవాలన్న అభిలాషతో అడిగాడు ఓ చివరగా కూచున్న విద్యార్థి హరి నారాయణ.

"గాంధీయేమో ఆ పదం రాయలేక పోయాడు రా. కానీ అతని ప్రక్కనే కూచున్న మరో విద్యార్థి మాత్రం కరెక్టుగా రాశాడు. అది గమనించిన ఉపాధ్యాయుడు అందులో చూసి కాపీ కొట్టి రాయమని గాంధీకి సైగ చేసి చెప్పాడు. అయితే గాంధీ రాయలేదు. చివరికి ఆ అధికారి వెళ్లిపోయాక మేస్టారుకి కోపం వచ్చి 'గాంధీ! నీ పక్కన కూచున్న కుర్రాడి పలకలో చూసి కాపీ కొట్టి రాయమంటే ఎందుకు రాయలేదు?' అని గట్టిగా అడిగే సరికి 'కాపీ కొట్టడం తప్పు కదండీ' అంటూ ఉపాధ్యాయుడికే బుద్ధి చెప్పి తన నిజాయితీని రుజువు చేసుకున్నాడు గాంధీ...! ఇదర్రా ఈ పాఠం. ఇదే విధంగా మీరు కూడా జీవితంలో నిజాయితీపరులై ఉండాలనినే కోరుకుంటున్నాను' అంటూ పాఠం ముగించేసి మళ్లీ ఓ చిటికెడు ముక్కు పొడుం పట్టు పట్టి గట్టిగా పీల్చేశాడు.

మరి కాసేపట్లో టైమయి పోయింది. పిల్లలందరూ పలక, పుస్తకాలు సర్దుకుని ఇళ్లకు వెళ్లేందుకు తయారయ్యారు. "ఒరేయ్ పిల్లలూ! ఇంత వరకు జరిగిన పాఠాలన్నీ ఇంటి దగ్గర బాగా చదువుకు రండి. సోమవారం నాడు పరీక్ష పెడతాను' అందరికీ చెప్పి పంపాడు.

యూనిట్ టెస్టు అయిపోయిన వారం రోజుల తర్వాత ఎవరెవరికి ఎన్ని మార్కులొచ్చాయో చెప్పుకు పోతున్నాడు గాంధీరావు మాస్టారు. తనకొచ్చిన మార్కులు విని సంతోషించాల్సింది పోయి ఘొల్లున ఏడ్చేశాడు హరినారాయణ.

"ఏరా! ఎందుకేడుస్తున్నావ్?" ఆశ్చర్యపోతూ అడిగేడు అయ్యవారు.

"....................................!"

"ఫర్వాలేదులే చెప్పు?" ఏడుపుకు కారణం తెలుసుకోగోరి మళ్లీ అడిగాడాయన.

"నేను కాపీ కొట్టి రాసినందువల్లే నాకు ఫస్టుమార్కులొచ్చాయండీ!" నిజం చెప్పి మళ్లీ ఏడుపు.

"ఏం నాయనా! నేనేం వెర్రి వెంగళప్ప ననుకున్నావా? నువ్వు చెప్పింది నమ్మటానికి" దీర్ఘాలు తీసి వెక్కిరించి అన్నాడు.

"నిజంగా నేను కాపీ కొట్టేరాశానండీ!"

"నోర్మూయ్యరా భడవా! కాపీ కొట్టి రాశాడట... కాపీ...!"

"అవును సార్!"

"నోర్మూయ్! మీరు పరీక్షలు రాస్తూండగా నేనిక్కడే ఈ కుర్చీలోనే బండరాయిలా కూచుని ఉంటే ఇక నువ్వు కాపీ కొట్టడానికి ఛాన్సెక్కడుందోయ్?" కళ్లెర్రజేసి కస్సు లేచాడు.

"బయట ఎండ ఎక్కువ ఉన్నందున ఉక్కపోతకు తట్టుకోలేక మీరీ గుమ్మం ముందు కూచున్నారు కాసేపటికి చల్లగాలి వీచేసరికి హాయిగా కునుకు తీశారు. మీరు నిద్రిస్తున్నది గమనించి నాకు తెలియని ప్రశ్నలన్నింటికి జవాబులు పుస్తకంలో చూసి గబగబా కాపీ కొట్టి రాశాను. నేనలా కాపీ కొట్టనట్టయితే నిజంగా నాకు ఫస్టు మార్కులొచ్చేవే కావు సార్!" తప్పు చేసినందుకు బాధపడుతూ చెప్పాడు హరినారాయణ.

'మీరు కునుకు తీస్తూండగా' అంటూ యదార్థం విప్పి చెప్పేసరికి గాంధీ రావు మాస్టారుకి తిక్క రేగిపోయింది. పళ్లు పటపటా కొరుకుతూ లాల్చీ జేబులోంచి పాత కాలపు డబ్బారేకు కళ్లజోడు పెట్టి బయటికి తీసి దాంతో రపీమని వాడినెత్తిన మొట్టేశాడు.

"సరస్వతి సాక్షిగా చెబుతున్నాను సార్! మీరు నిద్రిస్తున్నది గమనించే కాపీ కొట్టానండీ!" పుస్తకాల సంచిని నెత్తిన పెట్టుకుని చదువుల తల్లి మీద బాస చేశాడీసారి.

"ఏదో కుర్రాడులెమ్మనుకుని వదిలేస్తే అదుపు లేకుండా వాగుతున్నావేంట్రా? అట్టే వాగేవంటే పెద్ద సారుతో నీ మీద లేనిపోని వన్నీ చెప్పి స్కూల్లోంచి తీయించిపారేస్తాను జాగ్రత్త!!" కోపమాపుకోలేక కసిగా చెవి మెలేస్తూ అన్నాడు.

"మా అమ్మసాక్షిగా చెబుతున్నాను సార్! నేను కాపీ కొట్టినందువల్లే ఫస్టు మార్కులొచ్చాయి" తన తల్లిమీద ప్రమాణం చేసి చెప్పాడు. హరి నారాయణ.

"ఓ యబ్బో! మళ్లీ పుట్టుకొచ్చాడ్రా మహాత్మా గాంధీ. ఒరేయ్!... మొండిపీనుగా!! ఆఖరు సారిగా చెబుతున్నాను. నేను నిద్రపోయిన విషయం మరోసారి కూశావంటే నరికి పోగులు పెట్టేస్తాను' అంటూ రపారపా చెంపలు వాయించేసి అదే ఊపున జుట్టుపట్టి వంగదీసి కసిగా మోచేత్తో రెండు పోట్లు పొడిచేశాడు గాంధీరావు మాస్టారు.

కళ్లు బైర్లు కమ్మాయి. చుర్రుమన్న వీపును రెండు చేతులతోనూ రుద్దుకుంటూ బాధగా తలపైకెత్తేసరికి గోడకు వేలాడుతూన్న బోసి నవ్వుల బాపూజీ పటం కనిపించింది.

"బాపూజీ! నిజం చెప్పి నీలా ఉండాలనుకున్నందుకు నా వీపు చిట్లి పోయింది. నిజం చెప్పటం తప్పా బాపూజీ? తప్పే అయితే ఇక నేనెప్పుడూ నిజం చెప్పను" అందరికీ వినపడేలా అంటూ కారుతున్న కన్నీటిని చిరుగుల చొక్కాతో తుడుచుకున్నాడు నిజం చెప్పి చావు దెబ్బలు తిన్న విద్యార్థి హరినారాయణ.

